క్లుప్తంగా

ఒలింపిక్ నాణేల ప్రదర్శన



ప్రదర్శనలో ఆకట్టుకున్న ఆస్ట్రేలియా నాణేలు

అమలాపురం టౌన్: ఒలింపిక్ డే రన్ సందర్భంగా అమలాపురానికి చెందిన నాణేల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ పలు దేశాలు ఒలింపిక్‌కు సంబంధించి ముద్రించి విడుదల చేసిన నాణేలను సేకరించారు. ఆ నాణేలను అమలాపురంలో శుక్రవారం ఉదయం స్థానిక ఆఫీసర్స్ క్లబ్ వద్ద జరిగిన ఒలింపిక్ రన్ డే కార్యక్రమంలో ప్రదర్శించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ నాణేల ప్రదర్శనను తిలకించి కృష్ణ కామేశ్వర్‌ను అభినందించారు.

వారాహి స్వరూప నాగలికి ఆయుధ పూజలు



పూజలు అందుకున్న వారాహి స్వరూప నాగలి

అమలాపురం టౌన్: లోక కల్యాణార్థం శ్రీ గౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్‌నగర్‌లోని శ్రీ ఆది శేష నిలయంలో జరుగుతున్న వారాహి షోడశ రాత్రి మహోత్సవాలు శుక్రవారం నాటికి అయిదో రోజుకు చేరుకున్నాయి. కిరాత వారాహి మూల మంత్రాన్ని సాధకులు జపించారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పెంపొంది, సమస్త జీవరాశి సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో వారాహి స్వరూప నాగలికి ఆయుధ పూజలు నిర్వహించారు. మట్టిలో నిద్రాణమైన శక్తిని నాగలి వెలికితీసిన విధంగానే అమ్మవారి హలాయుధం.. సాధకుల్లో దాగి ఉన్న ఆధ్యాత్మిక శక్తిని వెలికితీసేలా ఈ పూజలు నిర్వహిస్తున్నారు.

మీజిల్స్, రూబెల్లా నియంత్రణకు కృషి



సమావేశంలో ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: మీజిల్స్, రూబెల్లా కేసులు లేని నియోజకవర్గంగా యానాంను నిలిపేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మీజిల్స్, రూబెల్లా వంటి వ్యాధుల నియంత్రణపై స్థానిక ఆర్ఏఓ ఆఫీసులో పుదుచ్చేరి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ డిప్యూటీ డైరెక్టర్ టి. రవిశంకర్ మాట్లాడుతూ మీజిల్స్, రూబెల్లా వ్యాధుల లక్షణాలను వివరిస్తూ గర్భాధారణ సమయంలో ఈ వ్యాధుల బారిన పడితే నవజాత శిశువులకు సమస్యలు ఏర్పడతాయన్నారు. నివారణకు వ్యాక్సిన్‌లను వేస్తున్నట్లు చెప్పారు. ఏడీ సన్యాల్, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ డైరెక్టర్‌గా కాపవరపు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీదేవి

తాళ్లరేవు: రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వైఎస్సార్ సీపీ నాయకురాలు కాపవరపు శ్రీదేవి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. చొల్లంగి గ్రామానికి చెందిన శ్రీదేవి ఇప్పటికే రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మహిళా అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. శుక్రవారం గొల్లపూడిలోని రాష్ట్ర కార్యాలయంలో నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర చైర్మన్ సిద్దవటం యానాదయ్య సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించారు.

ప్రభుత్వ స్కూళ్లు పనిదినాల సర్క్యులర్ విడుదల

యానాం: యానాం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో సీబీఎస్ సిలబస్‌ను ఈ విద్యాసంవత్సరం నుంచి అమలు చేస్తున్న నేపథ్యంలో 2023–23 అకడమిక్ ఇయర్ పనిదినాలు, కాంపన్‌సేట్ లాస్ ఆఫ్ వర్కింగ్ డేస్ వివరాలతో కూడిన సర్ పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (హయ్యర్ సెకండరీ వింగ్) పి.ప్రియదర్శిని విడుదల చేశారు. ఇకపై వారంలో పనిదినాలు ఐదురోజులు ఉంటాయని, అయితే వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఈ నెల 1నుంచి 13 వ తేదీ వరకు సెలవులు ఇచ్చిన నేపథ్యంలో వాటిని కాంపన్‌సేటెడ్ సెలవుగా పరిగణించి తిరిగి భర్తీ చేసేవిధంగా ఈ నెల 24న, జూలై 8, 22 ఆగస్టు 12, 26, సెప్టెంబర్ 9, 23 అక్టోబర్ 14, 28 శనివారాల్లో స్కూల్స్ యథావిధిగా తెరవాలని ఆదేశించారు.

వడిబడి అడుగులు

- కార్పొరేటుకు దీటుగా సర్కారు స్కూళ్లు
- నాడు–నేడుతో మారిన రూపురేఖలు
- విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు
- వెలవెలబోతున్న ప్రైవేటు పాఠశాలలు

కాట్రేనికోన: కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నవారికి విద్యను అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులను తెచ్చారు. పిల్లవాడి చదువు తల్లిదండ్రులకు భారం కాకూడదనే ధ్యేయంతో ప్రభుత్వం బాధ్యత తీసుకుంది. అమ్మ ఒడి పథకంతో తల్లి బ్యాంకు ఖాతాకు రూ.15వేలు జమ చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బడుగు, బలహీన వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం రూ.వేల కోట్లు విద్యారంగంపై ఖర్చు చేస్తోంది. కాట్రేనికోన మండలంలో ఎనిమిది జెడ్పీహెచ్ పాఠశాలలు, ఆరు ప్రాథమికోన్నత, 61 ప్రాథమిక పాఠశాలల్లో 5,955 మంది చదువుకుంటున్నారు. గతంలో కార్పొరేటు పాఠశాలల చుట్టూ తిరిగే విద్యార్థుల తల్లిదండ్రులు ఇప్పుడు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడంతో ప్రైవేటు పాఠశాలలు వెలవెలబోతున్నాయి.

మారిన రూపురేఖలు

గత ప్రభుత్వంలో శిథిలమైన ప్రభుత్వ పాఠశాల భవనాలను తొలగించిన ప్రభుత్వం నాడు నేడు పథకంతో అద్భుతంగా తీర్చిదిద్దింది. మండలంలో 48 పాఠశాలలు, రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.13.40 కోట్లు మంజూరు కాగా రూ.3.37 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ఫ్లోరింగ్ టైల్స్, తరగతి గదులలో ఫ్యానులు, లైట్లు, బెంచీలు, డెస్కులు, గ్రీన్‌చాక్ బోర్డులు, రక్షిత మంచినీటిని అందించేందుకు మినరల్ వాటర్ ప్లాంట్స్ , సౌకర్యవంతమైన వంట గదులు ఏర్పాటు చేశారు. పాఠశాల భవనాలు, ప్రహరీలను నిర్మించి వాటిపై అద్భుతమైన రంగులను వేసి జాతీయ నాయకులు చిత్రాలను రూపొందించారు. పాఠశాల ఆవరణలో పచ్చని మొక్కలు నాటటంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.

డిజిటల్ తరగతులు

ప్రభుత్వ పాఠశాలలోన్లూ తెలుగుతో పాటు, ఇంగ్లిషు మీడియంలో విద్యాబోధన అందిస్తున్నారు. ఎల్ఈడీ టీవీల ద్వారా విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా 611 మంది 8వ తరగతి విద్యార్థులకు, 102 టీచర్లకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందజేశారు. ఒక్కో ట్యాబ్‌కు రూ.16,500 చొప్పున రూ.1,17,64,500 ప్రభుత్వం ఖర్చు చేసింది.

జగనన్న విద్యాకానుక కిట్స్ అందజేత

పిల్లలకు పుస్తకాలు, ఇతర సామగ్రి సమకూర్చేందుకు గత ప్రభుత్వం హయాంలో చాలా జాప్యం జరిగేది. విద్యాసంవత్సరం మధ్యలో పుస్తకాలు వచ్చేవి. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెందేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో పాఠశాల ప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందజేస్తున్నారు.

పిల్లలకు యూనిఫారమ్, పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, సాక్సులు, బెల్టులు వంటి ఎనిమిది రకాల వస్తువులను జగనన్న విద్యాకానుక కిట్స్‌గా ప్రభుత్వం అందిస్తోంది. గతంలో ఒక్కో విద్యార్థికి రూ.1,600 విలువైన కిట్లును అందించేది. ప్రస్తుతం ఒక్కో విద్యార్థికి రూ.2,500 చొప్పున 5,955 మందిపై రూ. 1,48,87,500 ఖర్చు చేస్తోంది.

జగనన్న గోరుముద్దతో పౌష్టికాహారం

విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనం పథకంలో పెను మార్పులు తెచ్చి జగనన్న గోరుముద్దగా మంచి పౌష్టికాహారం అందిస్తున్నారు. భోజనంతో పాటు వారంలో ఐదు రోజులు గ్రుడ్డు, మూడు రోజులు వేరుశనగ చిక్కీ అందిస్తున్నారు. ఈ ఏడాది నుంచి రాగి జావను మెనూలో చేర్చి అందిస్తున్నారు.

తల్లుల బ్యాంకు ఖాతాలకు అమ్మఒడి సొమ్ము

ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.15వేలు చొప్పున అమ్మ ఒడి సొమ్ము తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు. మండలంలో 4,243 మంది విద్యార్థులకు అమ్మఒడి పథకం ద్వారా రూ.6,36,45,000 జమ చేస్తున్నారు. డిగ్రీ, బీటెక్, ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేస్తున్నారు. జగనన్న విద్యాదీవెన కింద ఒక్కొక్కరికీ రూ.20 వేలు, జగనన్న వసతి దీవెన కింద రెండు విడతలుగా తల్లుల ఖాతాలకు రూ.20 వేలు చొప్పున జమ చేస్తున్నారు.



చెయ్యేరులో నాడు నేడు పథకంలో అభివృద్ధి చేసిన జెడ్పీహెచ్ పాఠశాల



విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ (ఫైల్)

జగనన్న ఆణిముత్యాలు అద్భుతం



మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం విద్యార్థులను సన్మానించి, ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం అద్భుతం. మాబాబు ఓలేటి వీరభద్ర రామస్వామి నాయకర్ అమలాపురం మహాత్మ జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుతూ 10వ తరగతి పరీక్షలలో 560 మార్కులు సాధించి వెల్వేరు విభాగంలో జిల్లా ప్రథమ స్థానం సాధించాడు. జగనన్న ఆణిముత్యాలుకు ఎంపికయి కలెక్టర్ చేతుల మీదుగా రూ.50 వేలు నగదు బహుమతి అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహం నిరుపేద కుటుంబానికి చెందిన మాకు ఎంతో చేయూత నిచ్చింది. ఆణిముత్యాలకు ఎంపిక కావడంతో ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహం పైచదువులకు తోడ్పాటు నిచ్చింది. మూడేళ్ల నుంచి అమ్మఒడి సొమ్ము రూ.15 వేలు చొప్పున నా భార్య బ్యాంకు ఖాతాలో పడుతోంది. జగనన్న ఆణిముత్యాలు, అమ్మ ఒడి పథకాలతో లబ్ధి చేకూర్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– ఓలేటి శ్రీను, వేట్లపాలెం

పిల్లల చదువుకు ఇబ్బంది లేదు



పాఠశాల తెరిచారంటే పుస్తకాలు, దుస్తులు, ఇతర సామగ్రి కోసం ఆందోళన చెందవలసి వచ్చేది. పాఠశాలకు వెళ్లే పిల్లలకు కావలసినవన్నీ ప్రభుత్వం ఇస్తోంది. పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. వారానికి ఐదు సార్లు కోడిగుడ్లు వేస్తున్నారు. నాకు ఇద్దరు పిల్లలు. ఒకరికి అమ్మఒడి సొమ్ము క్రమం తప్పకుండా నా భార్య బ్యాంకు ఖాతాలో వేస్తున్నారు. దీంతో పిల్లల చదువుకు ఇబ్బంది లేకుండా ఉంది.

– చెక్కా పూజ, గచ్చకాయలపోర

క్రీడలు ఖండాంతర బంధాలు పెంచుతాయి

ఒలింపిక్ డే రన్‌లో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



అమలాపురంలో ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, క్రీడాకారులు, విద్యార్థులు

అమలాపురం టౌన్: క్రీడలు ఖాండంతర స్నేహా బంధాలు పెంచుతాయని ఎమ్మెల్సీ, మాజీ జాతీయ క్రీడాకారుడు కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. ఒలింపిక్ డే సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం జరిగిన రన్ ఫర్ ఒలింపిక్‌లో సూర్యనారాయణరావు ప్రసంగించారు. తొలుత ఒలింపిక్ రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆ పాఠశాల క్రీడా స్థలంలో రన్ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు క్రీడాకారులు, విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. క్రీడల పట్ల ఆసక్తి, గౌరవంతో నిబంధనలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా ఉంటానని ప్రతిజ్ఞ చేశారు. ఈ రన్‌లో వ్యాయామ ఉపాధ్యాయులు జి.శ్రీదేవి, తోట రవి, కుడుపూడి బుజ్జి, ఉన్నత పాఠశాలల విద్యాకమిటీ చైర్మన్లు అప్పారి సతీష్, దంగేటి జయప్రకాష్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, సర్ సీవీ రామన్ స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, క్రీడాకారిణి మహ్మద్ షకీలా పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, వేదికపై ఎంపీపీ శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గౌతమి

అల్లవరం: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన అల్లవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ప్రామాణికమైన 11 పత్రాలను జగనన్న సురక్ష పథకం ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసేందుకు నెల రోజుల పాటు గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఖరీఫ్‌లో కొత్త వరి వంగడం 1318 రకాన్ని పరిచయం చేశామని ఏఓ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. స్వర్ణ రకానికి ప్రత్యమ్నాయంగా ఈ రకాన్ని ఖరీఫ్‌లో పండించవచ్చున్నారు. డ్రెయిన్స్ ఏఈ సునీతాదేవి మాట్లాడుతూ డ్రెయిన్లలో తూటు తొలగింపు పనులు చేపట్టాం, సంఘం పుంత ఆధునీకరణకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రామేశ్వరం మొగ ఇసుక మేటలతో మూసుకుపోయిందని, త్వరగా మొగని ఓపెన్ చేసి ముంపు లేకుండా చూడాలని ఏఈ సునీతాదేవికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామి మాట్లాడుతూ జేజేఎం పథకం రెండో దఫా పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఎంఈఓ–2 ఏడుకొండలు మాట్లాడుతూ జేవీకే పథకం ద్వారా 5,377 మంది విద్యార్థులకు జగనన్న కిట్లు పంపిణీ చేశామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు గడువు తేదీ ముగిసిన నూని ప్యాకెట్లు వస్తున్నాయని, వీటిపై చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులను ఎమ్మెల్సీ ఆదేశించారు. హౌసింగ్ ఏఈ సుబ్బారావు మాట్లాడుతూ 1,540 ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామని ఈ నెలాఖారు నాటికి మంజూరు కావల్సి ఉందన్నారు. డ్వాక్రా వ్యవస్థలో అవినీతి రోజు రోజుకి ఎక్కువగా ఉందని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఏపీఎం సయ్యద్‌ని ప్రశ్నించారు. డ్వాక్రా మహిళలను బెదిరించి వీఓఏలు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దేవగుప్తం, గుండెపూడి వీఓఏలు స్వాహా చేసిన డబ్బును ఎందుకు రికవరీ చేయలేదని నిలదీశారు. దీనిపై ఏపీఎం సయ్యద్ మాట్లాడుతూ వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తొలుత గూడాల ఎంపీటీసీ సభ్యులు జల్లి మరియమ్మ మృతికి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు సాధనాల వెంకటరావు ఆధ్వర్యంలో సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీలు వడ్డి గంగ, ముత్యాల వెంకట రామకృష్ణ, ఎంపీడీఓ కృష్ణమోహన్, తహసీల్దార్ సాంబశివప్రసాద్ పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: నియోజకవర్గ పరిధిలోని మెట్టకూరులోని నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఎన్‌వీఎస్ వెబ్‌సైట్ సీబీఎస్ఈఐటీ ఎంఎస్.ఆర్ఈఐఎల్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేయాలన్నారు. ప్రవేశపరీక్ష 2024, జనవరి 20న ఉంటుందన్నారు. యానాం ప్రాంతానికి చెందిన వారై, ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి అంతరాయం లేకుండా చదువుతూ 01-05-2012 నుంచి 31-07-2014 సంవత్సరాల మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. దరఖాస్తులు చేయడానికి ఆఖరు తేదీ ఆగస్టు 8వ తేదీ అని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులతో వ్యక్తిగత సమాచారం, ఆధార్, ఫొటోలు, అభ్యర్థి, తండ్రి సంతకం తదితరమైనవి అప్‌లోడ్ చేయాలని సూచించారు.

పాఠశాలను పరిశీలించిన ఈఈ

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాబార్డ్ నిధులు రూ.1.49 కోట్లతో మంజూరైన పనులను ఈఈ వి.లక్ష్మణ్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నిధులతో ఆరు అదనపు తరగతి గదులు, విద్యార్థులకు టాయిలెట్స్, పాఠశాలలో కొన్ని అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. ఈ నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయని, పది రోజుల్లో పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఈఈ తెలిపారు. ఆయన వెంట హెచ్ఎం ఎల్.రాణి ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



తాళ్లరేవు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష ప్రారంభాన్ని వీక్షిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

తాళ్లరేవు: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నూరుశాతం పరిష్కరించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రాయుడు సునీత కోరారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, పలు కారణాల వల్ల ఆయా పథకాలను పొందలేని వారిని గుర్తించి అర్హులు అందరికీ ఫలాలు అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. మండలంలో రెండు టీంలుగా ఏర్పడి సర్వే చేసి అర్హులను గుర్తిస్తామన్నారు. అదేవిధంగా 11 రకాల సేవలకు సంబంధించి అవగాహన కల్పించి జూలై 23 వరకు ఆయా సేవలను ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.అనుపమ, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, రాయుడు గంగాధర్, పేర్ని ఆదినారాయణమూర్తి, రెడ్డి నాగేశ్వరరావు, అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ మెడికల్ కాలేజీకి అనుమతి

యానాం: పుదుచ్చేరిలోని ఇందిరాగాంధీ మెడికల్ కళాశాలలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ నియమ నిబంధనలు పాటించడం లేదంటూ ఇటీవల కళాశాలకు గుర్తింపు నిలుపు వేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి విద్యార్థులకు సంబంధించి 150 మెడికల్ సీట్లు డోలాయమానంలో పడ్డాయి. ముఖ్యంగా కళాశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయకపోవడం, అధ్యాపకులకు బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకోకపోవడం తదితర కారణాలతో మెడికల్ కౌన్సిల్ గుర్తింపు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఎన్ఎంసీ గుర్తించిన తేడాలను అన్నింటిని సరిదిద్దుకున్నామని 25 కెమెరాల ఏర్పాటు తదితరమైనవాటిని పూర్తి చేసినట్లు కళాశాల డీన్ మొదటి అప్పీల్‌గా దరఖాస్తు చేసుకోవడంతో శుక్రవారం ఎన్ఎంసీ పరిశీలించి 150 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతిచ్చింది.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించిన అధ్యాపకులు

యానాం: యానాం టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆ విధంగా అధ్యాపకులు సైతం కృషి చేయాలని వైస్ ప్రిన్సిపాల్ వి.చిత్ర పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటుచేసి గత విద్యాసంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు.

డి.భువనేశ్వరి, ఎన్.హెప్సిబా, పి.కనకేశ్వరీ, మహ్మద్ అలీషాలను వారి తల్లిదండ్రుల సమక్షంలో సత్కరించారు. ఫిజికల్ డైరెక్టర్ పీవీఎస్ ప్రకాష్, లెక్చరర్స్ వీఎస్‌యూ మీనాక్షి, రత్నప్రభ, గణేష్ బాబు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ముమ్మిడివరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నిరుద్యోగులకు స్కిల్ హబ్ ద్వారా ఉచిత శిక్షణ జాబ్ ప్లేస్‌మెంట్ కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోక్‌మాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, బీటెక్ చదివిన అభ్యర్థులు ఆయా కోర్సులకు తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేడు గోగుల్లంకలో గడపగడపకూ మన ప్రభుత్వం

ఐ.పోలవరం: మండల పరిధిలో శనివారం గోగుల్లంక గ్రామంలో జరిగే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి గోగుల్లంక గ్రామ వాటర్‌ట్యాంకు సమీపం నుంచి ఈ కార్యక్రమం జరుగుతుంది.

ఖాళీలు భర్తీ చేయాలని నిరుద్యోగుల నిరసన

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ శుక్రవారం వందలాది మంది నిరుద్యోగ గ్రాడ్యుయేట్‌లు ర్యాలీ నిర్వహించి సీఎం రంగసామికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ 8 ఏళ్లుగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు సైతం జారీచేయడం లేదన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన 116 సీనియర్ క్లర్క్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేస్తే 50వేల మంది పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్‌ల నుంచి దరఖాస్తు చేసుకున్నారని పోస్టులు చాలా తక్కువగా ఉన్నాయని ప్రభుత్వం గ్రహించాలని కోరారు. తక్షణం ఖాళీగా ఉన్న 259 పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

పవన్ కల్యాణ్ మాదిగలకు అన్యాయం చేస్తున్నారు

అమలాపురం రూరల్: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సామాజిక న్యాయం అంటూనే మాదిగలకు సీట్ల కేటాయింపులో అన్యాయం చేస్తున్నారని ఆకుమర్తి చిన్న మాదిగ అన్నారు. అమలాపురం కాటన్ గెస్ట్‌హౌస్‌లో మాదిగ రాజకీయ పోరాట సమితి మాదిగ సంఘాల అభిమానుల ఆధ్వర్యంలో ఆకుమర్తి చిన్న మాదిగకు సన్మానం నిర్వహించారు. సభలో చిన్నమాదిగ మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీలకు సామాజిక న్యాయంపై చిత్తశుద్ధి ఉంటే మాల మాదిగలకు సమానంగా సీట్ల పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు ఆకుమర్తి శ్రీను, బొమ్మి సురేష్, నవరపు వెంకటేశ్వరరావు, వీధి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కైలాసభూమి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో వృద్ధ గౌతమి మురుగునీటి కాలువ కైలాస భూమి సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కాలువ కుడివైపు గుర్రపు డెక్కలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 40 సంవత్సరాలు కలిగి ఒంటిపై నల్ల రంగు ప్యాంటు, పొడుగు చేతుల చొక్కా ధరించి ఉన్నాడు. ఎస్సై కె.సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి మృతుడు వివరాలు సేకరించే ప్రయత్నం చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని వృద్ధ గౌతమి మురుగునీటి కాలువ కైలాస భూమి సమీపాన శుక్రవారం లభ్యమైన మృతదేహం ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతానికి చెందిన షేక్ షబీర్(48)గా బంధువులు గుర్తించారు. షేక్ షబీర్‌ను ఒక దొంగతనం కేసులో గత 10 రోజులుగా విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి పంపిస్తున్నారు. అయితే గురువారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన అతను తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అతని మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహంతో ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేసేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నించగా, ఎస్సై కె.సురేష్‌బాబు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.